క్లుప్తంగా

నేడు పింఛన్ల పంపిణీ

వీరులపాడు: పింఛన్ లబ్ధిదారులకు వారి ఇళ్ల వద్దనే సోమవారం పింఛన్ పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో శివపార్వతి ఆదివారం తెలిపారు. మండల పరిషత్, రెవెన్యూ, వైద్యారోగ్య శాఖ సిబ్బందితోపాటు సచివాలయ ఉద్యోగులు, అంగనవాడీ కార్యకర్తలు కలిసి ఆయా పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ నగదు అందజేస్తారన్నారు. మండలంలోని 22 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 886మంది పింఛన్‌దారులకు పింఛన్ అందిస్తారని, ఒకటో తేదీన నూరు శాతం పింఛన్లు పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

మద్దులమ్మ తల్లికి ప్రత్యేకపూజలు



గొట్టుముక్కల(కంచికచర్ల): సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ గ్రామ పరిధిలోని అడివిలో ఉన్న మద్దులమ్మ తల్లికి ఆదివారం భక్తులు వరద పాశం పోశారు. మధ్యాహ్నం సమయంలో భక్తులు గట్టుపై నుంచి పాశాన్ని పోసి మొక్కులు తీర్చుకున్నారు.వర్షాలు సకాలంలో కురిసి పంటలు పండి రైతులు సంతోషంగా ఉండాలని ఎటువంటి ఆటంకాలు లేకుండా వ్యవసాయ పనులు సాగాలని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తాటుకూరు పూర్ణచంద్రరావు దంపతులు అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. కార్యక్రమంలో గొట్టుముక్కల ప్రజలతోపాటు నరసింహరావుపాలెం, కంచికచర్ల, పరిటాల, నక్కలంపేట, మూలపాటు గ్రామాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా సీతారామయ్య

నందిగామ: లయన్స్ క్లబ్ ఆఫ్ నందిగామ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం నందిగామ పట్టణంలోని ఓ ప్లాజాలో జరిగింది. లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఎం.సీతారామయ్య, కార్యదర్శిగా డాక్టర్ కె.లక్ష్మీకాంత్, కోశాధికారిగా ఎం ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం అనంతరం క్లబ్ ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో చేపట్టనున్న సేవా కార్యక్రమాలపై చర్చించారు. ఈకార్యక్రమంలో క్లబ్ సభ్యులు గాంధీ, సీతారామయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మారిన విద్యుత్‌స్తంభం



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని తొర్రగుంటపాలెంలో ప్రధాన రహదారి పక్కనున్న ఓ విద్యుత్ స్తంభం ఒరిగిపోయి ప్రమాదకరంగా మారింది. గత రాత్రి కురిసిన వర్షానికి తిరుమలగిరి రోడ్‌లో నేల బురదమయంగా ఉండటంతో విద్యుత్‌స్తంభం ఓ పక్కకు ఒరిగిపోయింది. దీంతో ఈ రోడ్డులో రాకపోకలు సాగించే వాహనచోదకులు, ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. విద్యుత్ స్తంభం నేలకొరిగితే పెద్ద ప్రమాదమే చోటుచేసుకుంటుందని ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన విద్యుత్‌స్తంభాన్ని సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

పేదలకు చీరల పంపిణీ



పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం ప్రశాంతినగర్‌లోని స్పందన వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేద వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ కార్యక్రమం ఆదివారం జరిగింది. స్పందన వాకర్స్ క్లబ్ ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన క్లబ్ జిల్లా గవర్నర్, ప్రముఖ న్యాయవాది చిన్నం రామకృష్ణ మాట్లాడుతూ.. వాకర్స్ క్లబ్ ప్రేరణతో ప్రజల ఆరోగ్యాన్ని మెరుగు పర్చడం ప్రధాన అంశం కావాలని ఆకాంక్షించారు. ప్రజలు ఆరోగ్యంగా జీవించడం ద్వారా సమాజం ఆరోగ్యంగా ఉంటుందని చెప్పారు. వాకర్స్ క్లబ్ ద్వారా ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా పేద వృద్ధ మహిళలకు 10 వేల రూపాయల విలువ చేసే చీరలను పంపిణీ చేశామని చెప్పారు. సేవా కార్యక్రమాల్లో వాకర్స్ క్లబ్ సభ్యులు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో స్పందన వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఇమ్మానేని కృష్ణప్రసాద్,సెక్రటరీ వై.కె.శాస్త్రి, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

కనుమరుగవుతున్న అపరాలసాగు

- మార్కెట్లో మండిపోతున్న పప్పుల ధరలు
- ఏటా తగ్గుతున్న సాగు విస్తీర్ణం
- రైతుల్లో సన్నగిల్లిన ఆసక్తి
- దిగుబడులు తగ్గి పెరుగుతున్న ధరలు



వత్సవాయిలో సాగవుతున్న పెసర పంట

వత్సవాయి : వాణిజ్య పంటల మోజులో పడి రైతులు అపరాల సాగుకి ఆసక్తి చూపడంలేదు. మార్కెట్లో పప్పుల ధరలు మండిపోతున్న ఆయా పంటలసాగుకు మాత్రం రైతన్న చూపు మళ్లడం లేదు. దీంతో అపరాల సాగు కనుమరుగవుతోంది. ప్రస్తుతం ఏ గ్రామంలో చూసినా పట్టుమని పది ఎకరాల్లో కూడా అపరాల సాగు కనపడటం లేదు.

వాణిజ్యపంటలపై పెరిగిన ఆసక్తి..

మార్కెట్‌లో కందిపప్పు, మినపపప్పు, పెసరపప్పుతోపాటు ఏ పప్పు దినుసులైనా కేజీ వంద నుంచి రెండు వందల రూపాయలు పలుకుతున్నాయి. గతంలో రూ.100లోపు ఉండే ఈ ధరలు మార్కెట్లో పప్పుల ధరలు ప్రజల కళ్లబైర్లు కమ్మేలా ఉన్నాయి. కందిపప్పు ధర కేజీ రూ.250 పెసరపప్పు రూ.20, మినపపప్పు రూ.150 బొబ్బర్ల పప్పు, శనగవిత్తనాలు రూ.120, మినపగుండ్లు రూ.150, పచ్చిశనగపప్పు రూ.160 పలుకుతున్నాయి. దీంతో వినియోగదారులు పప్పులు కొనాలంటే భయపడుతున్నారు. దీనికి ప్రధాన కారణం ఆయా అపరాల సాగుకు రైతులు విముఖత చూపుతుండటంతో దిగుబడులు తగ్గిపోయాయి. గతంలో రైతులు పత్తి, మిరప పంటలతోపాటు కంది, పెసర, మినుము పంటలను కూడా సాగుచేసేవారు. అయితే ఈ పంటలు కోత దశలో ఉన్న సమయంలో అధికంగా వర్షాలు పడుతూ తెగుళ్లు కూడా అధికంగా వచ్చేవి. వీటన్నింటిని తట్టుకుని సాగుచేసినా ఎకరానికి రెండు, మూడు క్వింటాళ్ల దిగుబడులు మాత్రమే వచ్చేవి. దీంతో పెట్టిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితుల నేపథ్యంలో రానురాను అపరాల సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. అపరాల సాగును తగ్గించి వాణిజ్య పంటలైన పత్తి, మిరప పంటల సాగుపై రైతులు దృష్టి సారిస్తున్నారు.

రైతుల ఇళ్లలో కనిపించని పప్పుధాన్యాలు.

గతంలో రైతుల ఇళ్లలో కందిపప్పు, పెసర, మినప, బొబ్బర్లపప్పులు ఎక్కువగా కనిపించేవి. పత్తి, మిరప పంటలతోపాటు అపరాల సాగును కూడా చేసేవారు. దీంతో రైతుల ఇళ్లల్లో పుష్కలంగా ఉండేవి. పండించిన రైతులు వీటిని ఇళ్లలో వినియోగిస్తూ, బంధుమిత్రులతోపాటు దూరప్రాంతాల్లో ఉన్న తమ కుటుంబసభ్యులు కూడా పంపించేవారు. కానీ నేడు పరిస్థితి మారింది. దీంతో గ్రామాల్లోని పెద్దపెద్ద రైతులు సైతం పప్పుల కోసం కిరాణా షాపులకు పరుగులు పెడుతున్నారు.

లాభదాయకంగా అపరాల సాగు..



ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో అపరాల సాగు లాభదాయకంగా మారింది. మార్కెట్లో అపరాలకు మంచి ధర కూడా ఉంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చు. అపరాల సాగు కనుమరుగు కావడంతో పప్పుల ధరలు ఆకాశానంటుతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే మార్కెట్లో పప్పులు కొనలేని రోజులు వస్తాయి. రైతులు వాణిజ్య పంటలైన పత్తి, మిరప పంటలపైనే ఎక్కువ దృష్టి పెడుతున్నారు. రైతులు పంటమార్పిడి విధానం పాటించి అపరాల సాగుపై దృష్టిపెట్టాలి.

– వి. రవికుమార్, వ్యవసాయాధికారి

మృతులకు ఉదయభాను నివాళులు



యాకోబుకు నివాళులర్పించి, అతని కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: విద్యుదాఘాతంతో ఆదివారం మృతిచెందిన గౌరవరం గ్రామానికి చెందిన జర్రిపోతుల యాకోబు మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రిలో జగ్గయ్యపేట మాజీఎమ్మెల్యే సామినేని ఉదయభాను సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులను ఓదార్చారు. యాకోబుకు నివాళులర్పించిన వారిలో కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటూరి రాజగోపాల్(చిన్నా), కేడీసీసీబీ డైరెక్టర్ కె.రవిశంకర్, సొసైటీ మాజీ అధ్యక్షుడు బాలసైదా ఉన్నారు.

కార్మికురాలి కుటుంబానికి పరామర్శ..

స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం పక్కనున్న 30వవార్డుకు చెందిన సిమెంట్ వరలు, వస్తువుల తయారీ కార్మిక కుటుంబానికి చెందిన వేముల కళావతి(65)ఆదివారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న మాజీఎమ్మెల్యే ఉదయభాను ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆమె కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతురాలి భర్త వేముల వెంకులు 20రోజుల కిందట గుండెపోటుకు గురై మృతిచెందారు. దీంతో దిగులుపడిన కళావతి వారంరోజుల కిందట పక్షవాతానికి గురై ఆదివారం మృతిచెందింది. భార్యా భర్తలిద్దరూ 20రోజుల వ్యవధిలోని మృతిచెందడంతో స్థానికులను కలచివేసింది.

ఘనంగా ఆలయ వార్షికోత్సవాలు



ప్రత్యేకాలంకరణలో మల్లికార్జునస్వామి , గోళ్ళమూడిలోని శంభులింగేశ్వరస్వామి

నందిగామ: మండలంలోని దాములూరు గంగా పార్వతీ సమేత మల్లికార్జునస్వామి ఆలయ 23వ వార్షిక కల్యాణ మహోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు దాములూరి శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. రాత్రి సమయంలో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా గోళ్ళమూడిలోని శ్రీగంగా పార్వతీ సమేత శంభులింగేశ్వర స్వామి ఆలయ 17వ వార్షిక మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ఆలయ అర్చకుడు రాజోలు సతీష్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. కల్యాణోత్సవాన్ని ఘనంగా జరిపించారు. ఆయా గ్రామాల ప్రజలు స్వామివార్లను దర్శించుకుని పూజలు చేశారు.

ఆరు సెంటీమీటర్ల వర్షపాతం నమోదు



మారాకు దశలో ఉన్న పత్తి మొక్క

నందిగామ: నందిగామ ప్రాంతంలో రెండు రోజులుగా నానుడి వర్షాలు కురుస్తున్నాయి. జూన్ రెండో వారంలో కురిసిన వర్షాలకు నియోజకవర్గ పరిధిలోని పలువురు రైతులు పత్తి విత్తనాలు నాటారు. అవి ప్రస్తుతం మొలకెత్తి మారాకు దశలో ఉన్నాయి. వాతావరణ శాఖ అధికారుల లెక్కల ప్రకారం శనివారం రాత్రి నుంచి ఆదివారం వరకు సుమారు ఆరు సెంటీమీటర్ల మేర వర్షపాతం నమోదైనట్లు వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు.

ఇక జూన్ మాసంలో 20సెంటీమీటర్ల సాధారణ వర్షపాతం కురవాల్సి ఉండగా, 22 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయిందని అధికారులు వివరించారు.

12 నుంచి పోలేరమ్మ తిరునాళ్ల

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఈ నెల 12వ తేదీ నుంచి మూడు రోజుల పాటు స్థానిక ఊర్మిళా సుబ్బారావునగర్ గ్రామ దేవత పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్లను నిర్వహిస్తున్నట్లు దేవస్థానం కమిటీ అధ్యక్షుడు సూరసాని రామిరెడ్డి తెలిపారు. ఆదివారం దేవస్థానం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించి, వివరాలను వెల్లడించారు. తొలి రోజు 12వ తేదీన కుంభాభిషేకం, పంచామృతాలతో అభిషేకం, కుంకుమ పూజ, 13న కుంభాషేకం, అన్నాభిషేకం, పంచామృతాలతో అభిషేకం, కుంకుమ పూజ, సాయంత్రం అమ్మవారికి లక్ష కుంకుమార్చన, 14వ తేదీ ఉదయం 7 గంటలకు కృష్ణానది నుంచి తీసుకువచ్చిన జలంతో కుంభాభిషేకం, పంచామృతాలతో అభిషేకం , అలంకరణ, మధ్యాహ్నం 12 గంటలకు పొంగలి నివేదన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. గత 37 ఏళ్లుగా పోలేరమ్మ తిరునాళ్ల నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి గుత్తావళి విజయబాబు, తుమ్మా తిరుపతి రెడ్డి, దొడ్డా వెంకటేశ్వరరెడ్డి, రాచమళ్ల రమణమ్మ, గొందేసి సత్యనారాయణరెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు గంటి సన్యాసిరావు, స్థానికులు పాల్గొన్నారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



భక్తులతో కిక్కిరిసిన క్యూలైన్లు



బోనాలు తెస్తున్న భక్తులు

పెనుగంచిప్రోలు:గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవుదినం కావటంతోపాటు పలు శుభకార్యాలు ఉండటం, మొక్కులు చెల్లించుకునేందుకు అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువజాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వేలాది వాహనాలు తరలి రావటంతో ఆదివారం పెనుగంచిప్రోలు పుణ్యక్షేత్రంలో ట్రాఫిక్ నగర వాతావరణాన్ని తలపించింది. ఆంధ్రా నుంచే కాక తెలంగాణ నుంచి కూడా వందల సంఖ్యల వాహనాల్లో భక్తులు తరలివచ్చారు. తెల్లవారు జాము నుంచి సాయంత్రం వరకు వాహనాల రద్దీ కొనసాగింది. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు తగు చర్యలు చేపట్టారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



భవాని, ఏడీఏ



పత్తి పంట (ఫైల్)

పెనుగంచిప్రోలు: పత్తి పంటను సాధారణంగా వర్షాధార నల్లరేగడి భూముల్లో ఎక్కువగా సాగు చేస్తుంటారు. నీటివసతి ఉన్నచోట గరప, ఎర్రనేలల్లో కూడా సాగుచేస్తుంటారు. గతేడాది పత్తిలో ఆశించిన మేర దిగుబడి రాకపోవడంతో నియోజకవర్గంలో ఈ ఏడాది సాగు విస్తీర్ణం కొంత తగ్గింది. మేలైన యాజమాన్యపద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని జగ్గయ్యపేట ఏడీఏ భవాని సూచిస్తున్నారు. ఆయా వ్యవసాయ పరిస్థితులకనుగుణంగా పత్తిసాగులో తీసుకోవాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులను ఏడీఏ వివరించారు.

పత్తి సాగుకు నేల తయారీ...

లోతైన నల్లరేగడి నేలలు, నీటి వసతి ఉన్న ఎర్రనేలలు పత్తిసాగుకు అనుకూలంగా ఉంటాయి. నేలను లోతుగా దున్ని విత్తటానికి అనువుగా చేసుకోవాలి. లోతుగా నాగలితో దున్నడం ద్వారా వర్షపు నీరు నేలలో బాగా ఇంకిపోతాయి. కలుపు ఉన్న నేల పైపొర కిందకు, కిందపొర పైకి వచ్చి కలుపు సమస్యతో పాటు ఇతర పురుగుల, తెగుళ్ల సమస్య తగ్గుతుంది.పత్తి పైరు వేళ్లు బాగా నేలలోనికి చొచ్చుకునిపోయి పైరుకు త్వరగా బెట్టరాకుండా ఉంటుంది.

విత్తనశుద్ధి...

పత్తి విత్తనాలను శుద్ధిచేసి రైతులకు ఇస్తున్నా ఇటీవల పైరు తొలిదశలో మొలకెత్తిన నాటి నుంచి చావు మొక్కలు ఎక్కువగా ఉంటున్నాయి. దీని నివారణకు కిలో విత్తనానికి 10 గ్రాముల ట్రైకోడెర్మావిరిడీ లేదా 2 గ్రాముల కార్బండిజమ్ లేదా మాంకోజెబ్‌తో విధిగా విత్తన శుద్ధి చేసుకోవాలి.

మొక్కల సాంద్రత...

సాధారణంగా రైతులు అన్ని నేలల్లో ఎకరాకి 4 నుంచి 5 వేల మొక్కలు వచ్చేలా అచ్చులో విత్తుకుంటారు. కానీ సాగు పరిస్థితి, నేలరకం, విత్తే సమయం, పంటకాలం ఆధారంగా మొక్కల సాంద్రతపై దృష్టి పెడితే పత్తిలో అధిక దిగుబడులు సాధించవచ్చు. ముఖ్యంగా వర్షాధారంగా సాగు చేస్తున్నప్పుడు సాలు తోటలకు ప్రాధాన్యమిస్తూ మొక్కల మధ్య, వరుసల మధ్య దూరాన్ని తగ్గించుకుంటే అధికసాంద్రత విధానం (8వేల నుంచి 12 వేల మొక్కలు ఎకరానికి) చేపట్టవచ్చు. మొదటి రెండు, మూడు కోతల్లోనే దిగుబడి అధికంగా ఉండటమే కాకుండా, పైరు త్వరగా చేతికి రావడంతో మార్కెట్‌కు అనుకూలంగా ఉంటుంది. పైరు చివరి దశలో అనగా డిసెంబర్ నెల తర్వాత పైరు పొడిగించబడినప్పుడు ఆశించే గులాబి రంగు పురుగు ఉధృతిని తప్పించుకుని మంచి దిగుబడులు, ఆదాయాన్ని పొందే వీలుంటుంది. వర్షాధారంగా సాగు చేస్తున్నప్పుడు పత్తి పైరును ఏక పంటగా కాకుండా అంతరపంటలుగా కంది, పెసర సాగు చేసుకుంటే అదనపు ఆదాయాన్ని పొందవచ్చు. బీటీ పైరు చుట్టూ నాలుగు వరసల నాన్ బీటీ పత్తి విత్తనాలను విధిగా విత్తుకోవాలి.

పోషక యాజమాన్యం.....

ఎకరానికి 150 కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేట్‌ను ఆఖరి దుక్కిలో వేసి కలియదున్నాలి. 150 కిలోల యూరియా, 40కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను మూడు నుంచి నాలుగు సమభాగాలుగా చేసుకొని విత్తిన 20 రోజుల నుంచి, 20రోజుల వ్యవధితో పైరుకు అందించుకోవాలి. బీటీ సంకర రకాలలో పూతదశ నుంచి మెగ్నీషియం , జింకు, బోరాన్ లోప లక్షణాలు ఎక్కువగా ఉంటాయి. వాటి నివారణకు ఆలోప లక్షణాలు కనబడిన వెంటనే అనగా ముదురు ఆకులు ఎర్రబడి ఎండిపోతున్నప్పుడు మెగ్నీషియం లోపంగా గుర్తించి లీటరు నీటికి 10గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్‌ను పిచికారీ చేసుకోవాలి. లేత ముదురాకులు(మధ్యలోని) ఆకులలోని ఈనల మధ్య భాగం పసుపురంగు వర్ణంలోకి మారుతుంటే జింకు లోపంగా గుర్తించి లీటరు నీటికి 2గ్రాముల జింక్ సల్ఫేట్‌ను పిచికారీ చేసుకోవాలి. పత్తిమొక్కల ఆకులు సాధారణ ఆకృతిలో కాకుండా పూత, పిందె ఎక్కువగా రాలుతున్నప్పుడు బోరాన్ లోపంగా గుర్తించి లీటరు నీటికి 1గ్రాము బోరాక్స్ కలిపి పిచికారీ చేసుకోవాలి.

కలుపు యాజమాన్యం...

సాధారణంగా రైతులు అంతర కృషి ఎద్దుల గుంటకతో లేదా ట్రాక్టర్‌తో చేసుకున్నప్పుడు వరుసల మధ్య కలుపు నివారణ సాధ్యమవుతుంది. కానీ మొక్కల మధ్య కలుపుతీతకు కూలీలపై, ఆయా సందర్భాల్లో కూలీల సమస్య అధికంగా ఉంటే రసాయనాలపై ఆధారపడుతున్నారు. పత్తి పైరులో ఏరకం కలుపు ఉందో గమనించి, తదనుగుణంగా రసాయన పద్ధతుల్లో కలుపు నివారణ చేపట్టాలి. పత్తి విత్తనాలు విత్తిన వెంటనే పెండి మిథాలిన్ 30 శాతం ద్రావణాన్ని ఎకరాకు 1.3–1.6 లీ. 200 లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారీ చేసుకోవాలి. విత్తిన 25–30 రోజులప్పుడు గడ్డిజాతి కలుపు అధికంగా ఉన్నప్పుడు ఎకరానికి 400 మి.లీ క్విజలోఫాస్ ఇథైల్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. గడ్డిజాతి, వెడల్పాటి ఆకులు గడ్డి ఎక్కువగా ఉన్నప్పుడు ఎకరాకు 250 మి.లీ పైరిథయెబ్యాక్ సోడియం అనే కలుపు మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. పైపాటుగా కలుపు మందులను పిచికారీ చేస్తున్నప్పుడు నేలలో తగినంత తేమ ఉండేటట్లు చూసుకోవాలి. పొలంగట్లు, పొలం పరిసరాల్లో రసం పీల్చే పురుగులకు ఆశ్రయం ఇచ్చే వయ్యారిభామ, తుత్తురబెండను సమూలంగా నాశనం చేయాలి.

సమగ్ర సస్యరక్షణ...

బీటీ పత్తిలో రసం పీల్చే పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. కావున 30రోజుల సమయంలో 10 మి.లీ మోనోక్రోటోఫాస్‌కు 40 మి.లీ నీళ్లు కలిపి కాండానికి బ్రెష్ సహాయంతో పూయాలి. అలాగే 60 రోజులకు 2మి.లీ ఇమిడాక్లోప్రిడ్‌కు 40 మి.లీ చొప్పున నీటిని కలుపుకొని కాండానికి మందు పూసుకోగలిగితే రసం పీల్చు పురుగులను సమర్థవంతంగా నివారించుకోవచ్చు. పొలంలో అక్కడక్కడా ఎకరానికి 10 చొప్పున పసుపు రంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకొని తెల్లదోమల ఉధృతిని అంచనా వేసుకుంటూ తదనుగుణంగా సస్యరక్షణా చర్యలు చేపట్టాలి. గులాబీ రంగు ఉధృతి, పురుగుల ఉనికిని అంచనా వేయటానికి లింగాకర్షణ బుట్టలను ఎకరానికి 4–8 చొప్పున ఏర్పాటు చేసుకొని రోజుకు 8 చొప్పున మూడు రోజులకు 24 రెక్కల పురుగులు పడటం గమనిస్తే స్థానిక వ్యవసాయాధికారుల సలహాలను పాటించి తగిన సస్యరక్షణ చర్యలను చేపట్టాలని ఏడీఏ సూచించారు. ఇలా పత్తిలో సమగ్ర యాజమాన్యపద్ధతులను పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ వివరించారు.

పేటలో ఎడతెరిపి లేకుండా జడివాన



బాలుర హైస్కూల్ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు



జలమయమైన కోదాడ రోడ్డు

జగ్గయ్యపేట అర్బన్ : వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జగ్గయ్యపేటలో రెండురోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పట్టణంలో శనివారం రాత్రి నుంచి ఏకధాటిగా కురుస్తున్న జడివానకు పలురోడ్లపై వరదనీరు చేరి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ రోడ్డు, సత్యనారాయణపురం, పాత ఎస్ఎస్పీ కాలనీ, కాకానినగర్, ప్రధానమైన కోదాడ రోడ్డులోని పలు ప్రాంతాలు నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అనేక చోట్ల డ్రెయిన్లు పొంగి రోడ్లపైకి నీరు ప్రవహించడంతో పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నగర కమిటీ ఎన్నిక

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. బందరు లాకులు సమీపంలోని సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో సంస్థ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో సంస్థ నగర శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మానవత సేవా సంస్థ విజయవాడ శాఖ అధ్యక్షుడిగా దావులూరి సాంబశివరావు, కార్యదర్శిగా పగిడిపల్లి రాము, కోశాధికారిగా యశోద ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంస్థ రాష్ట్ర కార్యదర్శి మరుబోయిన కోటేశ్వరరావు మాట్లాడుతూ.. పదవీ విరమణ తర్వాత తమ వంతుగా సమాజానికి ఏదో ఒకటి చేయాలని మానవత సంస్థ ఏర్పాటు చేశామన్నారు. ఆపదలో ఉన్న వారికి తోడుగా ఉండటమే సంస్థ లక్ష్యమని చెప్పారు. తమ సంస్థ అనతి కాలంలోనే రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించిందన్నారు. గతేడాది కాలంలో నిర్వహించిన కార్యక్రమాలను ఆయన వివరించారు. మరణానంతరం నేత్ర, శరీర దానం ఆవశ్యకతను తెలిపారు. అనంతరం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేసింది. సమావేశంలో జిల్లా చైర్మన్ వేమూరు బాబురావు, ఉపాధ్యక్షుడు టీఎస్ శ్రీనివాసరావు, కార్యదర్శి నేమాని కామేశ్వరి, కమిటీ సభ్యులు సత్యనారాయణ రాజు రంగప్రసాద్ పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

పాయకాపురం(విజయవాడరూరల్): వాంబేకాలనీలో నివాసం వుంటున్న చిన్న కామేష్ ఒక ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. గత నెల 29వ తేదీ రాత్రి కామేష్ ఇంటి వద్ద వాంబేకాలనీకి చెందిన లక్ష్మణ్, ఆదిలక్ష్మి, వరప్రసాద్ అనే వారు కేకలు వేశారు. కేకలు ఎందుకు వేస్తున్నారని అడిగినందుకు తనపై దాడి చేసి గాయపర్చినట్లు కామేష్ తెలిపాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని పోలీసులు చెప్పారు.